క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ట

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తిమ్మాపురంలో మంగళవారం తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే పూజ కార్యక్రమాలకు భక్తులు హాజరై పూజలు చేశారు. అమ్మవారికి కలశార్చనలు జపపారాయణాదులు, చండీహోమం, కన్నా పూజలు, మహాసీరాజనం వంటి పలు కార్యక్రమాలతో పాటు ప్రత్యేక అర్చనలు ద్వారా ఘనంగా పూజలు చేశారు. గ్రామ వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని అశ్వ వాహనంపై ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నిమ్మకాయల దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది. అర పదును వర్షం కురిసిందని, మరోసారి వర్షం పడితే దుక్కులు దున్నేందుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, కంది, సజ్జ పంటలకు వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

192 మందికి వైద్య పరీక్షలు



పౌష్టికాహారం అందజేస్తున్న రవీంద్రారెడ్డి

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్టలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 192 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి రోగులకు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కె.ఎస్.పల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి నాయబ్ రసూల్, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, డీఎం కిరణ్, డీఎల్ హెచ్‌సి బా, ఆరోగ్య మిత్ర శేఖర్ పాల్గొన్నారు.

రేగడపల్లి శ్రీవారి ఆలయంలో పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా లక్ష్మీ గణపతి, సుదర్శన, నవగ్రహ హోమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వసంతోత్సవం నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

భర్త మోసం చేశాడని కేసు నమోదు

కురిచేడు: తన భర్త పగడాల శివశంకర్ మోసం చేశాడని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఎస్సై యం. దేవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాత పోలీసుస్టేషను వద్ద గల యువతికి గుంటూరు గుజ్జిన గుండ్లకు చెందిన పగడాల శివశంకర్‌తో వివాహం జరిగింది. కొంతకాలం వారి సంసారం అన్యోన్యతగాసాగింది. ఆ తరువాత శివశంకర్ ఇతర మహిళలతో సంబంధాలు పెట్టుకుని , తనను అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది.

రీసర్వే వేగవంతం చేయాలి

ముండ్లమూరు: భూ రీసర్వే వలన రైతులకు అనేక రకాల ప్రయోజనాలు చేకూరుతాయని ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీ కిషోర్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. డీటీ పుల్లారెడ్డి, రీసర్వే డీటీ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏడీ కిషోర్‌బాబు మాట్లాడుతూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కేవీ ప్రసాద్, డీఐ సుబ్బరాయుడు, డీటీ ప్రశాంత్, మండల సర్వేయర్ బాబురావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పొలం వివాదంలో కేసు నమోదు

దర్శి: పోతవరం గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి తిరుమల నారాయణపై ఆస్తి విషయంలో గొడవ పడ్డాడని చిన్నపురెడ్డి సావిత్రి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొంత కాలంగా తన వదిన చిన్నపురెడ్డి సావిత్రి పొలాన్ని సాగు చేసుకుంటోంది. ఆపొలం తనదని తిరుమల నారాయణ పొలంలోకి వెళ్లడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవన ఎరువులతో ఖర్చు తక్కువ

దర్శి: జీవన ఎరువులు వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలని ఆత్మ పీడీ, డీఆర్సీహెడ్ కె. అన్నపూర్ణ సూచించారు. బొట్లపాలెం రైతు భరోసా కేంద్రం పరిధిలో ఎరువులను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఏడీఏ వి. బాలాజీ నాయక్, వ్యవసాయాధికారులు ఏ. శైలజా నాథ్, వీవీ శేషమ్మ, ఏఆర్ఎస్ సైంటిస్ట్ రాజేష్ చౌదరి పాల్గొన్నారు.

మాతృ భాషను మరువద్దు

- ఎస్పీ మలికా గర్గ్ సూచన
- గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి



రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

మార్కాపురం: తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు మహనీయుడని ఎస్పీ మలికా గర్గ్ కొనియాడారు. రామ్మూర్తి పంతులు 160వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మార్కాపురం పోలీసుస్టేషన్ ఆవరణలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రామ్మూర్తి పంతులు తెలుగు భాషా అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. మాతృ భాషను మరువవద్దని సూచించారు. ట్రైనీ ఎస్పీ అంకితా సురానా, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ఎస్బీ డీఎస్పీ మరియదాస్, సీఐ భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషపై గొప్ప ఉద్యమం చేశారన్నారు. తెలుగుభాషా వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, పద్య పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ గురుశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: వ్యావహారిక భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి కృషి మరువరానిదని స్థానిక జెడ్పీ పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం గిడుగు రామూర్తి జయంతి, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీబాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ఉద్యమకర్త గిడుగు వెంకట రామమూర్తి, క్రీడా స్ఫూర్తి ప్రదాత ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవోలు పి.ఆంజనేయులు, ఎస్.మల్లునాయక్, హెచ్ఎం మంత్రూనాయక్, పీఎంసీ చైర్మన్ ఎ.రాజశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: తెలుగు భాష గొప్ప తనం ప్రతి ఒక్కరూ గుర్తించాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర, బాలికల సంక్షేమ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలుగు భాషకు పట్టం కట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు అందించిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆయన విశేష కృషితో వ్యవహారిక భాషలో రచనలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఆదిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరోలు: మాతృభాష గొప్పదనాన్ని తెలుసుకుని తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్‌బీఎన్ఆర్ఎం పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలతో కూడిన దుస్తులు ధరించారు. తెలుగు పద్యాలు, గేయాలు, పొడుపు కథల పోటీలు నిర్వహించారు. చిన్నారులచే తెలుగు అక్షరాలతో విన్యాసాలు చేయించారు.

మార్కాపురం టౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం మార్కాపురంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. క్రీడా పోటీల్లో విజేతలకు కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య బహుమతులు అందించారు. మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్యాం సుభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలో లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కస్సెట్టి జగన్‌బాబు, లింగారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం షేక్ మౌలాలి ఆధ్వర్యంలో గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ చైర్మన్ సత్యనారాయణ సీఆర్పీ పీరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఒలంపిక్ రింగ్స్ ఆకృతిలో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. గ్రాంథిక భాషను ప్రజల భాషగా మార్చడానికి గిడుగు చేసిన కృషిని, తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అంజలి ఘటించారు.

దర్శి: కట్టశింగన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుధాకరరావు తెలుగుభాష గొప్పదనం, జాతీయ క్రీడోత్సవ ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఉపాధ్యాయులు జి. వేణు, సయ్యద్ సుభాని, సీహెచ్ హైమావతి పాల్గొన్నారు.

దర్శి బాలికోన్నత పాఠశాలలో..

జాతీయ క్రీడా దినోత్సవాలు హెచ్ఎం ఖాదర్ మస్తాన్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కబీర్,కీర్తి, నాగజ్యోతి, పద్మావతి, భారతి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గిడుడు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్ఎం ఎల్. మాధవీలత, ఉపాధ్యాయులు హజరత్ అలీ, భారతి, శ్రీదేవి, చక్రపాణి పాల్గొన్నారు.



లక్ష్మక్కపల్లిలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గిడుగు, ధ్యాన్‌చందలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తెలుగు అక్షరాలతో నిలబడిన చిన్నారులు



రామమూర్తి, ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పిస్తున్న ఎంఈవోలు



దర్శిలో ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ముండ్లమూరు: రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఒలింపిక్ రింగ్స్ ఆకృతిలో తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



గొట్లగట్టు కేజీబీవీలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళి

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



తర్లుపాడులో సీతారామస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో కనకదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో అమలక లక్ష్మీ నారాయణస్వామి కోలాటం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దమల్లయ్య, తమ్మిశెట్టి శ్రీను, బండారు నాగరాజు, బండారు ప్రసాద్, మాజీ ఎంపీపీ బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక బీసీ కాలనీలో పట్టాభి సీతారామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పవన్‌కుమార్ శర్మ, వెంకట లక్ష్మీ ప్రసాద్ స్వామి వారి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. స్వామివారి కల్యాణం కనులపండువగా సాగింది. బీసీ కాలనీ వాసుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా వైఎస్సార్ సీపీ కౌన్సిల్ సభ్యులు రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ వన్నెబోయిన అంకమ్మ, మీర్జపేట ఎంపీటీసీ పార్వతీ రమేష్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ కుందురు సత్యనారాయణ రెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదకరంగా చప్టా

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై చప్టా శిథిలావస్థకు చేరింది. పాపాయిపల్లెకు వెళ్లే రోడ్డు వద్ద హైవే రోడ్డు చప్టా కుంగిపోయి ఒక వైపున వెడల్పుగా గుంత ఏర్పడింది. భారీ వాహనాలు వెళ్తే చప్టా కుంగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో గుంతలో పడి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంత పడిన వైపున రోడ్డు కొద్ది కొద్దిగా కుంగుతోంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై భారీ వాహనాలు తిరిగే సమయంలో ఒక్కసారిగా కుంగితే పెద్ద ప్రమాదం జరుగుతుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.



హైవే చప్టాపై ఏర్పడిన గుంత

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

కొమరోలు: మండలాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా, సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనగా మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి గురించి వివరించారు. కొమరోలులో ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా మార్జిన్లు చూపించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు కొమరోలు ఎంపీటీసీలు ఆర్అండ్‌బీ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. నల్లగుంట్లలో భూముల రీసర్వే తప్పుల తడకగా చేశారని, మళ్లీ రీ సర్వే నిర్వహించాలని నల్లగుంట్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. మండలంలో ప్రజలు విద్యుత్ కనెక్షన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్నా పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్‌శాఖ సిబ్బంది ధృవీకరణ పత్రాలు మంజూరు చేయకుండా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కొత్త మీటర్లను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యలను తీర్చడానికే ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఉన్నారని, ప్రజల సమస్యలను వెనువెంటనే అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవో శ్రీనివాసకుమార్, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కామూరి అమూల్య

ఏపీ అభివృద్ధి సీఎం జగన్‌తో సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ఏపీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతో ఉందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులతో మంగళవారం మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నారు కాబట్టే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని చెప్పారు. బీమా సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. దర్శి, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల జేసీఎస్ కన్వీనర్లు బత్తినేని వెంకటేశ్వర్లు, మేరువ సుబ్బారెడ్డి, గుంటు పోలయ్య, మేడికొండ జయంతి, యాడిక శ్రీనివాసరెడ్డి, నగరపంచాయతీ జేసీఎస్ కన్వీనర్ ఎదురుకోటిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

పుల్లలచెరువు: అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎల్‌ఓసీని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మంగళవారం అందచేశారు. మండలంలోని కొండారెడ్డి కోష్టాలుకు చెందిన మునగాల రాఘవరెడ్డికి అనారోగ్యం ఉండటంతో ఒమేగా వైద్యశాలలో చేరారు. వైద్యం కోసం ఖర్చు అధికమవుతుందని మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని మంత్రి అందజేశారు. సకాలంలో స్పందించి ఆదుకున్న మంత్రి సురేష్ రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయనిధి ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి సురేష్

మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ వెళ్లే దారిలోని పొలాల్లో ఓ వ్యక్తి పోలీసు జీపు చూసి పరుగెడుతుండగా పట్టుకొని 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యం. దేవకుమార్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ. 1900 ఉంటుందన్నారు. నిందితుడు మీనిగ రామయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు

పనితీరు మెరుగు పరుచుకోండి

తాళ్లూరు (ముండ్లమూరు): లక్ష్య సాధనలో భాగంగా సిబ్బందికి కేటాయించిన వివిధ రకాల పనులను సకాలంలో పూర్తి చేయాలని దర్శి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. జగనన్నతోడు లబ్ధిదారులను గుర్తించి రుణాలు ఇప్పించాలన్నారు. ఏపీఎం దేవరాజ్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

యంత్రసేవా పథకం రైతులకు ఉపయోగం

తాళ్లూరు (ముండ్లమూరు): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులో మంగళవారం పరికరాలను పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

కురిచేడు: రైతులు పంటపొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యం. దేవకుమార్ మంగళవారం తెలిపారు. ఏఈ సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 25న దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని తీగలు తీసుకెళ్లారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కొనకనమిట్ల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఎస్పీ బాలయ్య, వైఎస్సార్ క్రాంతి పథం సీసీ రాజయ్యను మంగళవారం సాయంత్రం అంబేడ్కర్ యూత్ ఫోర్స్ నాయకుడు బాలనరసయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో డాక్టర్ బాలయ్య, మహిళా సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్న సీసీ రాజయ్య మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. పిల్లి బాలనరసయ్య, కొండయ్య, కొంగ్రు వెంకటేశ్వర్లు, కరుణయ్య, ఐజాక్, ప్రభుత్వ న్యాయవాది ధర్నాసి రామారావు, ఏపీఎం గోపాల కృష్ణారెడ్డి, సీసీ ఎజ్రా, ఎంపీటీసీ మాజీ సభ్యులు కె.నరసయ్య, మంచికల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



డాక్టర్ బాలయ్య, సీసీ రాజయ్యను సన్మానిస్తున్న అంబేడ్కర్ యూత్

పాడి రైతులకు రుణాలు

ముండ్లమూరు: అమూల్ పాల కేంద్రాలకు పాలు పోసే రైతులకు రెండు లక్షల వరకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని దర్శి పీడీసీసీ బ్యాంకు మేనేజర్ యోగేశ్వరరావు అన్నారు. నూజిళ్లపల్లి సచివాలయం వద్ద మంగళవారం జగనన్నపాల వెల్లువ రుణమేళా నిర్వహించారు. ఎంపీడీఓ హనుమంతరావు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారులు విజయలక్ష్మి, కాశిరెడ్డి, అమూల్ రూట్ ఆఫీసర్లు మాలకొండయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన నాయకులు

కొనకనమిట్ల: మండల ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బ్రహ్మనాయుడిని మంగళవారం పలువురు నాయకులు కలిసి అభినందించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొంగ్రు వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కరుణయ్య, చిరుగూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనోవికాసానికి క్రీడలు దోహదం

మార్కాపురం రూరల్: విద్యార్థుల్లో మనోవికాసం, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేలా విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలని, అదే సమయంలో క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని సూచించారు. గతంలో పాఠశాలకు వచ్చేందుకు రెండు బస్సులు మాత్రమే ఉండేవని, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మరో రెండు బస్సులను అదనంగా ఏర్పాటు చేయించామని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇగ్నైట్ యంగ్ మైండ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీ, విద్యాకమిటీ చైర్మన్ గుంటక కృష్ణారెడ్డి, బండి రాఘవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ